క్లుప్తంగా

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

జే.పంగులూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వైద్య సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌సీజీ క్యాన్సర్ సెంటర్ మేనేజర్ వై.వినీల్ కుమార్ వస్తున్నట్లు చెప్పారు. గ్రామ ప్రజలు పాల్గొని వినియోగించుకోవాలని కోరారు.

నేటి నుంచి ఆలయ 19వ వార్షికోత్సవం

మేదరమెట్ల: కొరిశపాడు మండలం మేదరమెట్ల సాయినగర్‌లో కొలువై ఉన్న షిరిడీ సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవం మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ స్వామి వారికి విశేష పూజలు నిర్వహించడం, సాయంత్రం స్వామివారి నగరోత్సవం నిర్వహించనున్నారు. 7వ తేదీ ఉదయం కాగడ హారతి, విష్ణు సహస్రనామం, సంకీర్తన, అభిషేకం, హారతి అనంతరం అన్నదానం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

బధిరుల పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం

అద్దంకి: చైతన్య మహిళా మండలి ఆధ్వర్యంలో 23 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పట్టణంలోని కాకానిపాలెం చైతన్య బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు నిర్వాహకురాలు పూనూరి ఆరోగ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో 5 నుంచి 16 ఏళ్లలోపు వయసు కలిగిన బుద్ధిమాంద్యత, మాటలు రాని, వినికిడి లోపం కలిగిన వారు ప్రవేశానికి అర్హులని తెలిపారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోని వారైనా ఈ పాఠశాలలో చేరవచ్చని తెలిపారు. ప్రవేశం పొందిన వారికి ఉచిత విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులు, కంప్యూటర్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఐదేళ్ల లోపు విద్యార్థులకు ఇంటి వద్దే శిక్షణ పొందిన సిబ్బందిచే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 92900 83319, 89789 23919, 96766 99033 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

రెవెన్యూ సేవలు సత్వరమే అందించాలి

చీరాల టౌన్: విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్నందున విద్యార్థులకు కావాల్సిన వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల మంజూరులో రెవెన్యూ అధికారులు, సిబ్బంది అశ్రద్ధ వహించకుండా విధులు నిర్వహించాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సేవలు అందించాలన్నారు. భూమిశిస్తు వసూళ్లు, నీటి తీరువా వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, భూముల ఆన్‌లైన్, కుల ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీటీ సురేష్, ఆర్‌ఐలు శేఖర్, శంకర్, వీఆర్వోలు, సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

చీరాల టౌన్: మండలంలోని గ్రామ పంచాయతీల్లో చేస్తున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయించాలని ఎంపీడీవో నేతాజీ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న ప్రభుత్వ భవనాలు, సచివాలయాలు, సీసీరోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీలకు ప్రభుత్వం కేటాయించిన నిధులతో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్మూలన చేసి చెత్త నుంచి సంపద కేంద్రాల వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేయాలన్నారు. పెండింగ్ అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ఈవోఆర్డీ మురళీబాపూజీ, కార్యదర్శులు, సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు ఉన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న వైద్యాధికారి

అద్దంకి: మలేరియాను దేశంలో లేకుండా నిర్మూలిద్దామని కాకానిపాలెం యూపీహెచ్‌సీ డాక్టర్ మునగా అనీల్‌కుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభించారు. ఎండలు ఎక్కువగా కాస్తున్నందున ప్రజలంతా ఓఆర్ఎస్, జింక్‌ను అతిసార వ్యాధిని రూపుమాపడం కోసం ఉపయోగించాలని చెప్పారు. మలేరియా వ్యాధిని నిర్మూలించడం కోసం మరుగుదొడ్డికి వెళ్లే ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. అందుకోసం వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేసి ఆయా విషయాలపై విజ్ఞానవంతులను చేయాలని కోరారు. యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి

మేదరమెట్ల: ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చనే సదుద్దేశంతో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొరిశపాడు మండలం మేదరమెట్ల తమ్మవరం రోడ్డు సింథైట్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ సింథైట్ గ్రూప్ జాయింట్ ఎండీ అజు జాకబ్ ఆదేశానుసారం గ్రామంలో మొక్కల పంపిణీ చేశారు. ప్రతినిధులు మాట్లాడుతూ మొక్కను మనం రక్షించుకుంటే అది తిరిగి మనల్ని కాపాడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఐదు మొక్కలు చొప్పున నాటడంతో పాటు వాటిని పెరిగి పెద్దవి అయ్యేందుకు దోహదపడాలని సూచించారు. కంపెనీలో పనిచేస్తున్న సిబ్బందికి 200 మొక్కలు అందజేశారు. మేదరమెట్ల ఎస్‌ఐ పి.నాగ శివారెడ్డి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ కె.పరమేశ్వరరావు, యూనిట్ హెడ్ సుమన్ కోడే, హెచ్‌ఆర్‌లు అబ్దుల్ సలాం, అజుపాల్ పాల్గొన్నారు.


చీరాల అర్బన్: విద్యార్థులకు మొక్కలు అందిస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


మొక్కలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు


మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి నిషాద్‌నాజ్

వేటపాలెం: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వేటపాలెం మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆధునికీకరణలో భాగంగా పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందన్నారు. వాతావరణ సమతుల్యత దెబ్బతినడంతో విపత్తులు సంభవిస్తున్నాయన్నారు. వెంకటలక్ష్మి, ప్రత్తి కృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రోటరీ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబూరావు అన్నారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక రోటరీ సామాజిక భవనం ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందిన 30 మంది చిన్నారులకు మొక్కలు పంపిణీ చేశారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్లాస్టిక్‌ను నివారిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం..అని నినాదాలు చేశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆవరణలో మొక్కలు నాటారు. బాలవెంకటేశ్వరరావు, చీరాల కృష్ణమూర్తి, సుభాషిణి, పోలుదాసు రామకృష్ణ, సలావుద్దీన్, వలివేటి మురళీకృష్ణ, ఎస్‌వీ స్వామి, డీవీ సురేష్, జాలాది కృష్ణ, ఉమామహేశ్వరరావు, చారుగుళ్ల ప్రసాద్ పాల్గొన్నారు. పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొటెక్ట్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ప్రొటెక్ట్ సంస్థ కార్యదర్శి చంద్రారెడ్డి, అప్కాస్ట్ కో ఆర్డినేటర్ భానుచంద్రమూర్తి, గ్రంథపాలకురాలు ధనమ్మ పాల్గొన్నారు.

చీరాల టౌన్: పెరుగుతున్న కాలుష్య నివారణకు, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కె.రమణారెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మండలంలోని కావూరివారిపాలెం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఏడాదికి ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. పెరిగిపోతున్న ఉష్ణోగ్రతల నివారణ, కాలుష్యం లేకుండా ఆహ్లాదకంగా ఉండాలంటే ఇంటి వద్ద మొక్కలు నాటి రక్షించాలన్నారు.

అద్దంకి: పర్యావరణ పరిరక్షణతో గాలి, నీరు, వాతావరణం కలుషితం కాకుండా చూసుకోవచ్చని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.జయచంద్రరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మోదేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని శంఖవరప్పాడులో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జయచంద్రరావు మాట్లాడుతూ నీటిలో కెమికల్ వ్యర్థాలు, గాలిలోకి విషతుల్య వాయువులను వదలడంతో గాలి, నీరు కలుషితం అవుతాయని చెప్పారు. మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు.

చీరాల రూరల్: పచ్చని మొక్కలతో పర్యావరణం మెరుగుపడుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి ఇంటికొక మొక్క చొప్పున నాటి పర్యావరణాన్ని పది కాలాలపాటు కాపాడాలని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్‌నాజ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయమూర్తి మొక్కలు నాటారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌బాబు, చంద్రశేఖరరావు, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: చెట్లు మానవ మనుగడకు ఎంతో అవసరమని రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం రోటరీ క్లబ్ సింగరకొండ ఆధ్వర్యంలో రోటేరియన్ కరి రామయ్య సౌజన్యంతో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. చెట్లకు నీరు పెట్టేందు వాటర్ పైపును పాఠశాలకు బహూకరించారు. కరి రామయ్య పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. టి.బాబూరావు, ఆంజనేయులు, మహ్మద్ రఫీ, మలాది శ్రీను, వీరయ్య, శ్రీలక్ష్మి, త్రిమూర్తులు, ప్రిన్సిపాల్ దుర్గా గాయత్రి పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

మార్టూరు: జాతీయ రహదారిపై సోమవారం జరిగిన మూడు ప్రమాదాల్లో పలువురు గాయపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది కథనం ప్రకారం.. జాతీయ రహదారిపై కోలలపూడి సమీపంలో ఒంగోలు వైపు కర్రల లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన శేఖర్, వెంకటేశ్వర్లు అనే ఇద్దరు హైవే అంబులెన్స్ సిబ్బంది ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో కారు, లారీ ఢీ కొన్న ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న అంజిరెడ్డి అనే వ్యక్తికి తీవ్రగాయాలు, ముగ్గురు మహిళలు స్వల్పంగా గాయపడటంతో హైవే అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను ఒంగోలు సంఘమిత్ర హాస్పిటల్‌కు తరలించారు. మరో ప్రమాదంలో పెదనందిపాడుకు చెందిన సైదులు తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఒంగోలు వెళ్తూ ఇసుక దరిశి సమీపంలో వాహనం అదుపుతప్పి ఇద్దరు రోడ్డుపై పడి స్వల్పంగా గాయపడ్డారు. హైవే అంబులెన్స్ సిబ్బంది దంపతులను మార్టూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అంకమ్మ తల్లిని దర్శించుకున్న ఆమంచి

కుంకలమర్రు (కారంచేడు): మండలంలోని కుంకలమర్రులో కొలువైన గ్రామ దేవత రేణుక అంకమ్మ తల్లిని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త ఆమంచి కృష్ణమోహన్ సోమవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో కొలువైన అంకమ్మతల్లికి కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అమ్మవారి కొలుపులను పురస్కరించుకొని ఆమంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందించారు. పర్చూరు ఏఎంసీ మాజీ చైర్మన్ జువ్వా శివరామప్రసాద్, సర్పంచ్ ఈదర సౌందర్య, ఎంపీటీసీ సభ్యురాలు చుక్కా రత్నకుమారి, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


అంకమ్మ తల్లిని దర్శించుకున్న ఆమంచి కృష్ణమోహన్

ఆమంచిని కలిసిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్

పర్చూరు: రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు సోమవారం పందిళ్లపల్లిలోని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌ను ఆయన నివాస గృహంలో కలిశారు. ఈ సందర్భంగా పర్చూరు, చీరాలకు చెందిన పలువురు నాయకులు అయనకు సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయాల గురించి వారు ఇరువురు చర్చించుకున్నారు. కారంచేడు ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు, పర్చూరు వైఎస్సార్ సీపీ కన్వీనర్ కఠారి అప్పారావు, వైస్ సర్పంచ్ గాదె సురేష్, ఆకుల హేమంత్, అడపా సుధాకర్‌రెడ్డి, గుది రామకృష్ణ, మిరియాల శ్రీను, లక్కల రాము, నెల్లూరి శ్రీను, నాగేశ్వరరెడ్డి, ఉప్పలపాటి అనిల్, మాజీ ఏఎంసీ డైరక్టర్ బాబు, కౌన్సిలర్ సత్యానందం, బండ్లబాబు,చీరాల, పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు,


ఆమంచిని కలిసిన రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

చినగంజాం ఎంపీడీఓగా స్వరూపరాణి

చినగంజాం: మండల అభివృద్ధి అధికారిగా కత్తి స్వరూపరాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల రాష్ట్రంలో జరిగిన అధికారుల ప్రమోషన్‌ల్లో భాగంగా ఆమె ఈఓపీఆర్డీ క్యాడర్ నుండిచి ఎంపీడీఓ పదోన్నతి పొందారు. ఇప్పటి వరకు ఈఓపీఆర్డీగా ఇదే మండలంలో పనిచేస్తున్న ఆమె కొంతకాలంగా ప్రమోషన్ జాబితాలో ఉండి ఎంపీడీఓగా పదోన్నతి కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నిర్వహించిన ప్రమోషన్‌లో ఆమె ఇదే మండల అభివృద్ధి అధికారిగా బాధ్యతలు స్వీకరించడం విశేషం. పంచాయతీ కార్యదర్శులు మస్తాన్‌వలి, సూర్యనారాయణ, భారతి, శైలజ, సుబ్బారావు, బాబురావు, కృపారావు ఉన్నారు.


ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన స్వరూపరాణి

మహిళలను వేధించిన ఎంపీని అరెస్టు చేయాలి

చీరాల రూరల్: ప్రపంచ స్థాయిలో దేశానికి పేరుప్రతిష్టలు తెచ్చిన మహిళా రెజ్లర్లను (మల్ల యోధులు) లైంగికంగా వేధింపులకు గురిచేసిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ చీరాల ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన మహిళా మల్ల యోధులను రెజ్లర్ల ప్రతినిధిగా ఉన్న ఎంపీ బ్రిజ్ భూషణ్ వారి పట్ల అమానుషంగా ప్రవర్తించి లైంగికంగా వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు. దేశ ప్రధాని, కేంద్ర హోం మంత్రులు తక్షణమే కలుగజేసుకుని అటువంటి వారిని తక్షణమే ఎంపీ పదవి నుంచి తొలగించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలపై జరుగుతున్న దాడులను హిందుత్వ వాదులే ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. మనువాదుల సంస్కృతి పోవాలంటే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. నిరసన ర్యాలీలో నాయకులు బత్తుల శామ్యూల్, దుడ్డు విజయ్ సుందర్, ఊటుకూరి వెంకటేశ్వర్లు, గుమ్మడి ఏసురత్నం, మాచర్ల మోహనరావు, సయ్యద్‌బాబు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం.. ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం పూర్వాషాడ నక్షత్రం విదియ తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థానం ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందె తీర్థం, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 1.30 గంటల వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు శ్రీ సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

జూట్ బ్యాగ్‌ల పంపిణీ

మార్టూరు: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మార్టూరు కూరగాయల మార్కెట్ యార్డులో సోమవారం జూట్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొర్రపాటి ఖాజారావు, ఎలక్ట్ సెక్రటరీ మధుమాల కోటేశ్వరరావు, ఎలెక్ట్ ట్రెజరర్ చెరుకూరి నాగేశ్వరరావు, క్లబ్ సభ్యులు చింతల సుబ్బారావు పాల్గొన్నారు.


జూట్ బ్యాగులు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

పంగులూరు ఎంపీడీఓగా రామాంజనేయులు


ఎంపీడీఓ రామాంజనేయులు

జే.పంగులూరు: పంగులూరు ఎంపీడీఓగా రామాంజనేయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఎంపీడీఓగా పనిచేస్తున్న రమణమూర్తి ఒంగోలు బదిలీ అయ్యారు. ముండ్లమూరు మండలంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న రామాంజనేయులు పదోన్నతిపై పంగులూరు ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన లారీ


గాయపడిని లారీ డ్రైవర్

సంతమాగులూరు (అద్దంకి): లారీ.. ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన సంఘటన మండలంలోని అద్దంకి–కొమ్మాలపాడు రహదారిలో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు నామ్ రహదారిలో కొమ్మాలపాడు సినిమా హాల్ వద్దకు రాగానే ఒంగోలు వైపు వెళ్తున్న లారీ దగ్గరలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది. లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు.

నేడు స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల

● 30వ సిడిమాను మహోత్సవం

కారంచేడు: గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి 30వ తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ, దేవదాయ శాఖలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. గ్రామాన్ని వరదలు ముంచెత్తుకు వచ్చే సమయంలో తన చీర కొంగును అడ్డుపెట్టి గ్రామ ప్రజలను కాపాడిన స్వర్ణమ్మ తల్లిని గ్రామస్తులు గ్రామ దేవతగా పూజిస్తుంటారు. గ్రామ దేవత స్వర్ణమ్మతల్లి తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. సోమవారం అమ్మవారికి గ్రామ ఆడపడుచులు పసుపు..కుంకమ సమరించడం ఇక్కడ ఆనవాయితీ. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, సిడిమాను మహోత్సవం, అమ్మవారి ఘటం కుండలు, హరిశ్చంద్ర నాటకాలు, రంగు రంగుల విద్యుత్ ప్రభల ఏర్పాటు చేస్తారు.

బైకు అదుపుతప్పి యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: బైకు అదుపుతప్పడంతో బైకిస్టుకు గాయాలయ్యాయి. ఈ సంఘటన అద్దంకిలో సోమవారం రాత్రి జరిగింది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీ 3వ లైన్‌కు చెందిన గుంజి సుధాకర్ బైకు మీద వస్తుండగా ఆటుగా వెళ్తున్న గేదె బెదిరి మీదకు రావడంతో బైకు అదుపుతప్పి కిందపడటంతో గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సంస్కృతంపై శిక్షణ శిబిరం

అద్దంకి రూరల్: విజయవాడకు చెందిన సంస్కృత భారతి ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల వెనుక బజారులోని రామసుశీల నిలయంలో 10 రోజులు సంస్కృతంపై శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మైనర్లకు బైకులు ఇస్తే జరిమానా

ఇంకొల్లు (చినగంజాం): మైనర్ బాలురు, బాలికలు ద్విచక్ర వాహనాలు రోడ్లపై నడుపుతూ ఎక్కువగా కన్పిస్తున్నారని వారికి వాహనాలిచ్చే వారికి జరిమానాలు విధిస్తామని ఇంకొల్లు ఎస్‌ఐ ఎస్‌కే నాయబ్ రసూల్ హెచ్చరించారు. మైనర్‌ల ద్విచక్ర వాహనాలు ట్రాఫిక్ రోడ్లపై అవగాహన లేక నిబంధనలు తెలియక తికమక పడటంతో ఎదురుగా వచ్చే వాహనదారులకు అర్థంకాక అనేక సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఇంకొల్లు సీఐ సూర్యనారాయణ తన పరిధిలోని స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేయడంతో సోమవారం మండలంలోని పూసపాడు, ఇంకొల్లు గ్రామాలలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి వారి తల్లిదండ్రులకు పిల్లలకు వాహనాలు ఇవ్వడంతో జరిగే నష్టాల గురించి వారికి అర్థమయ్యే రీతిలో ఆయన వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు.

మైనార్టీల సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మార్టూరు: దశాబ్దాల కాలంగా రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఎదుర్కొంటున్న మైనార్టీలు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయన తనయుడు, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల కాలంలోనే సంక్షేమ ఫలాలు పొందగలుగుతున్నారని వైఎస్సార్ సీపీ మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి అన్నారు. స్థానిక గన్నవరం రోడ్డులో సోమవారం మైనార్టీలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ మైనార్టీలకు విద్యా, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్‌లు కల్పించారు. ప్రస్తుతం సీఎం 34,17,199 మంది మైనార్టీ కుటుంబాలకు డీబీటీ ద్వారా రూ.11,896 కోట్లు జమ చేయటమే కాక జగనన్న విద్యాదీవెన, అమ్మఒడి, వసతి దీవెన, షాదీ తోఫా తదితర పథకాల్లో ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని కాలేషావలి అన్నారు. మైనార్టీలు తాను పొందిన మేలును మరువరని, ఎప్పటికీ సీఎం వైఎస్ జగన్‌తోనే తమ ప్రయాణం కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా హర్‌దిల్‌మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్‌కే సాథ్ కరపత్రాలను ముస్లిం కుటుంబాలకు పంపిణీ చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి, కారుచోల సులేమాన్, కొండ మస్తాన్, ఎంపీటీసీ కరిముల్లా పాల్గొన్నారు.

దేవస్థానం నిర్మాణానికి శంకుస్థాపన

వేటపాలెం: మండలం పరిధిలోని రామన్నపేట పంచాయతీ పాలేటినగర్ కాలనీలో వేణుగోపాల స్వామి దేవస్థానం నిర్మాణం కోసం సోమవారం శంకుస్థాపన చేశారు. గతంలో ఉన్న దేవస్థానం శిథిలమవడంతో దాతల సహకారంలో నూతనంగా దేవస్థానం నిర్మాణానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బండ్ల తిరుమలాదేవి, బులసల రామలింగేశ్వరరావు, భానుమూర్తి, బండ్ల విజయ, కర్ణకుమార్ స్వామి, బాజీ, మల్లవరపు చెంచయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న దంపతులు

ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి

బల్లికురవ: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బల్లికురవ ఎంఈవో బి.వీరరాఘవయ్యపై తక్షణమే శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు కోరారు. సోమవారం గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయంలో జిల్లా, మండల శాఖల బాధ్యులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. రెండేళ్లుగా ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న ఎంఈవోపై ఆర్జేడీ, బాపట్ల జిల్లా కలెక్టర్, డీఈవో, ఎంపీడీవో, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు ఫిర్యాదు చేసిన తదుపరి గత నెల 20వ తేదీన ఆర్జేడి వీఎస్ సుబ్బారావు బల్లికురవలోని ఎంఈవో కార్యాలయానికి వచ్చి రికార్డుల పరిశీలనతో విచారణ చేపట్టారని పేర్కొన్నారు. విచారణకు ఎంఈవో గైర్హజరైనా బాధిత విశాంత్ర, ఉపాధ్యాయులు ఆధారాలు సమర్పించారని, చర్యలు తీసుకోవటంతో ఎందుకు తాత్సారం చేస్తున్నారని వినతి పత్రంతో నాయకులు ప్రశ్నించారు. ఈ నెల 15వ తేదీలోపు చర్యలు తీసుకోకపోతే గుంటూరులోని ఆర్జేడీ కార్యాలయం వద్ద వివిధ రూపాల్లో తమ నిరసన తెలియజేస్తామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బాపట్ల, పల్నాడు జిల్లాల ప్రధాన కార్యదర్శులు అడుగుల శ్రీనివాసరావు, ప్రేమ్‌కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, కళాధార్, బల్లికురవ మండల బాధ్యులు డి.శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి, గాలం వీరాంజనేయులు, పి.రామాంజనేయులు, సంపతి శ్రీనివాసరావు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు